క్లుప్తంగా

19న జిల్లాస్థాయి కబడ్డీ టోర్నీ

పాలకొండ రూరల్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మ దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 19న జిల్లాస్థాయి కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో పోటీలు ఉంటాయని తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న క్రీడాకారులు 9849316945, 9948066185 నంబర్లను సంప్రదించాలని సూచించారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.15వేలు, ద్వితీయ బహుమతి రూ.10వేలు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన టీంలకు రూ.8వేలు చొప్పున నగదు అందించనున్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన గిరిని అభినందిస్తున్న కోచ్

కురుపాం: స్థానిక మహాలక్ష్మీ ఒకేషనల్ కళాశాల విద్యార్థి పువ్వల గిరి రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపికైనట్లు కోచ్ కె.నరేష్, జిల గోపాల్ సోమవారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో నిర్వహించిన పోటీల్లో అండర్-19 విభాగంలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు చెప్పారు. విద్యార్థిని కళాశాల సిబ్బంది, తోటి విద్యార్థులు అభినందించారు.

నేడు వెలగవాడ, తూడిలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

పాలకొండ రూరల్: మండలంలోని వెలగవాడ గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి సోమవారం తెలిపారు. గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటల నుంచి నిపుణులైన వైద్యులతో వైద్యసేవలు అందించనున్నట్లు చెప్పారు. సచివాలయం పరిధిలోని ప్రజలంతా వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తూడి గ్రామంలో..

వీరఘట్టం: మండలంలోని తూడి గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ చందక సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ముందస్తుగా గ్రామస్తులకు సమాచారాన్ని తెలియజేయాలని సూచించారు.

విద్యా సామగ్రి వితరణ



నోట్‌పుస్తకాలు, జామెట్రీ బాక్సులను చూపిస్తున్న విద్యార్థులు

గుమ్మలక్ష్మీపుర: మండలంలోని పెదఖర్జ గ్రామంలో 1 నుంచి 5వ తరగతికి చదువుతున్న 58 మంది విద్యార్థులకు గుమ్మలక్ష్మీపురం ఏపీజీవీ బ్యాంకులో ఫీల్డ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.నాగరాజు, కుటుంబ సభ్యులు సోమవారం విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఒక్కో విద్యార్థికి 5 నోట్ పుస్తకాలు, 5 పెన్నులు, 5 పెన్సిళ్లు, జామెట్రీ బాక్స్, తదితర వాటిని అందజేశారు. విద్యార్థులను చదువులో ప్రోత్సహించేందుకు వీటిని పంపిణీ చేసినట్లు నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లేష్, గ్రామపెద్దలు భూషణ్, చిరంజీవి, కృష్ణ, రఘు తదితరులున్నారు.

సమయం వృథా చేయొద్దు

పాలకొండ రూరల్: విద్యార్థులు దసరా సెలవుల్లో సమయం వృథా చేయవద్దని శాఖాగ్రంథాలయ అధికారి బి.గణేష్‌బాబు అన్నారు. స్థానిక గ్రంథాలయంలో చిత్రలేఖనంపై శిక్షణ తరగతులను సోమవారం ప్రారంభించారు. ఉపాధ్యాయుడు జి.మురళి బొమ్మలు ఎలా వేయాలో పిల్లలకు వివరించారు. గ్రంథాలయ అధికారి జనరల్ నాలెడ్జ్, దేశనాయకుల జీవిత విశేషాలను వివరించారు.

పఠనాసక్తిని పెంపొందించేందుకే..

గరుగుబిల్లి: విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించేందుకు గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయం నిర్వాహకుడు ఎస్.మధుసూదనరావు అన్నారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదేశాల మేరకు శాఖా గ్రంథాలయంలో సోమవారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులతో కథలు, జాతీయ నాయకుల జీవిత చరిత్ర పుస్తకాలను చదివించారు. పుస్తక పఠనం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు.

బాలాత్రిపురసుందరిగా దుర్గమ్మ



పాలకొండ రూరల్: నక్కలపేట షిర్డీసాయి మందిరంలో కొలువైన అష్టాదశ శక్తిపీఠాలు

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవి అమ్మవారు సోమవారం బాలాత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. సామూహిక కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. పాలకొండలో వెలసిన కోటదుర్గమ్మ దర్శనానికి భక్తులు పోటెత్తారు. పాలకొండ, కురుపాం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.

– సాక్షి నెట్‌వర్క్



పాలకొండ: బాలాత్రిపురసుందరి అలంకరణలో కోటదుర్గమ్మవారు



వీరఘట్టం: గాయిత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన కోటదుర్గమ్మ



కురుపాం: రావాడ రోడ్డు జంక్షన్ వద్ద పూజలందుకుంటున్న కోటదుర్గమ్మ



జియ్యమ్మవలస: చినమేరంగిలో బాలాత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చిన దుర్గాదేవి



గరుగుబిల్లి: నాగూరులో దుర్గమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

ప్రజారోగ్య భద్రతే లక్ష్యంగా..

- గ్రామాల్లో 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాలు
- వైద్య సేవలపై ఎమ్మెల్యే కళావతి, డీఐఓ జగన్నాథరావు ఆరా..



పాలకొండ రూరల్: తుమరాడ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఎమ్మెల్యే కళావతి, ప్రజాప్రతినిధులు, అధికారులు

పాలకొండ రూరల్: ప్రజారోగ్య భద్రతకు జగనన్న ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని ఏపీ శాసనసభ ఆర్థిక వ్యవహారాల అంచనా కమిటీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని తుమరాడ సచివాలయం పరిధిలో సోమవారం నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్యశిబిరాన్ని ఆమె సందర్శించారు. శిబిరంలో ఏర్పాట్లు, ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు, మందులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమానికి కట్టుబడి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి మీరంతా ఆయన్ను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పి.శోభారాణి, దుప్పాడ కళావతి, వారాడ నాగేంద్ర నాయుడు, వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకాష్, తహసీల్దార్ పి.సోమేశ్వరరావు, ఈఓపీఆర్డీ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బగాది జగన్నాథరావు ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సందర్శించి వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు.

- **సీతంపేట:** మండలంలోని మర్రిపాడులో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపీపీ బి.ఆదినారాయణ పరిశీలించారు. రోగులకు హెల్త్‌కిట్లు పంపిణీ చేశారు.
- **వీరఘట్టం:** మండలంలోని చిన్నగొరకాలనీలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. నిపుణులైన నలుగురు వైద్యులు సుమారు 360 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేసినట్లు ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. ఈ శిబిరం వద్ద ఐసీడీఎస్ సిబ్బంది పౌష్టికాహార ప్రదర్శన ఏర్పాటు చేశారు.

అందరికి మెరుగైన వైద్యం

భామిని: మండలంలోని ఘనసరలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే కళావతి సందర్శించారు. ప్రజలందరికీ మెరుగైన ఆరోగ్య సేవలందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. వైద్య సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి కిల్లారి ఫాల్గుణరావు, ఎరుకుమజ్జి పాపినాయుడు, తహసీల్దార్ నీలాపు అప్పారావు, ఎంపీడీఓ జి.చంద్రరావు, వైస్ ఎంపీపీ బి.ధర్మారావు, జేఈఎస్ కోఆర్డినేటర్ కె.చంద్రశేఖర్, సొసైటీ చైర్మన్ గెల్లంకి రమేష్, సర్పంచ్‌లు ఎరుకుమజ్జి ప్రభావతి, కిల్లారి కమల, బిడ్డిక నారాయణ, తదితరులున్నారు.



గుమ్మలక్ష్మీపురం: దిగువ మండలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో సూచనలు చేస్తున్న డీఐఓ డాక్టర్ టి.జగన్మోహనరావు



వీరఘట్టం: చిన్నగొరకాలనీలో ఆరోగ్య సురక్ష శిబిరం వద్ద పౌష్టికాహార ప్రదర్శన



సీతంపేట: మర్రిపాడులో ఆరోగ్య సురక్ష సేవలను పర్యవేక్షిస్తున్న ఎంపీపీ ఆదినారాయణ

గిరిజన గ్రామాల్లో మరింత మెరుగ్గా..

గుమ్మలక్ష్మీపురం: మారుమూల గిరిజన గ్రామాల్లో ప్రజలకు 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం ద్వారా మరింత మెరుగైన వైద్యం అందేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. మండలంలోని దిగువ మండ గ్రామంలో సోమవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన పరిశీలించారు. శిబిరానికి వచ్చిన వారితో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలను తెలుసుకున్నారు. వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరాతీశారు. అలాగే ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించారు. పౌష్టికాహారం ఆవశ్యకతను ప్రజలకు వివరించాలని సిబ్బందికి సూచిచారు. కార్యక్రమంలో తహసీల్దార్ జె.రాములమ్మ, సర్పంచ్ నిమ్మక హైమావతి, ఈఓపీఆర్డీ జగదీష్‌కుమార్ తదితరులున్నారు.

గిరిజన స్పందనకు 49 వినతులు

సీతంపేట: ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గిరిజన స్పందనకు 49 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి ప్రజా సమస్యలపై వినతులు స్వీకరించారు. మినీ ట్రాక్టర్ మంజూరు చేయాలని సొంటినూరుకు చెందిన చిన్నమి, టెంట్‌హౌస్ ఇప్పించాలని వడమసాయికి చెందిన మోహనబాబు, కుట్టుమిషన్ ఇప్పించాలని వలగజ్జికి చెందిన ఉమాదేవి అధికారులను కోరారు. వైద్యుత్ లైన్ మార్చాలని కింద్రువాడకు చెందిన సవర రామారావు, సీసీ రోడ్డు మంజూరు చేయాలని మర్రిమానుగూడ గ్రామస్తులు త్రినాథరావు, మేకలు, గొర్రెల కొనుగోలుకు రుణం మంజూరు చేయాలని మందసకు చెందిన సవర రాజు వినతిపత్రాలు అందజేశారు. తమ గ్రామం వద్ద వంతెన నిర్మించాలని బర్న గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో ఏపీఓ రోసిరెడ్డి, ఈఈ సింహాచలం, పీఏఓ హరికృష్ణ, డిప్యూటీ ఈఓ లిల్లీరాణి పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న పీఓ కల్పనాకుమారి

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

గరుగుబిల్లి: బాల్య వివాహాలు చేయడం, ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని మండల పరిషత్ అధ్యక్షుడు ఉరిటి రామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు అన్నారు. మండల కేంద్రంలో వెలుగు ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళా సంఘాల సభ్యులతో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆడపిల్లలకు 18, మగవారికి 21 ఏళ్లు నిండిన తర్వాతే వివాహాలు చేయాలన్నారు. బాల్య వివాహాలు చేయడం వల్ల పిల్లల్లో అనేక అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహించేవారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.పైడితల్లి, డాక్టర్ ప్రియాంక, ఎంఈఓ నాగభూషణరావు, ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు, ఏపీఎం పి.అప్పలనాయుడు, మహిళా సమైఖ్య అధ్యక్షురాలు గంట లక్ష్మి తదితరులున్నారు. అలాగే ఉల్లిభద్ర, రావివలస, పెద్దూరు గ్రామసచివాలయాల పరిధిలో బాల్యవివాహాలపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు.

ప్రతి ఒక్కరూ సహకరించాలి

భామిని: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం డి.భవానీ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై సోమవారం అవగాహన కల్పించారు. దీనిపై బాలికల తల్లిదండ్రులకు, గ్రామస్తులకు అవగాహన కల్పించడం ద్వారా బాల్య వివాహాల నిర్మూలనకు కృషిచేయాలని సూచించారు. అనంతరం అంబేడ్కర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారంగా ఏర్పడి బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతిజ్ఞ చేశారు. వీఓఏలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.



భామిని: బాల్య వివాహాల నిర్మూలన ప్రతిజ్ఞ చేస్తున్న మహిళా సంఘాల సభ్యులు, వెలుగు సిబ్బంది



గరుగుబిల్లి: ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ రామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ బాపూజీనాయుడు

వాహనాల దారి మళ్లింపు

పాలకొండ రూరల్: శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టారు. పట్టణంలోకి వచ్చే ఆర్టీసీ బస్సులు, ఇతర భారీ వాహనాలను దారి మళ్లిస్తున్నారు. విశాఖ, పార్వతీపురం మీదుగా వచ్చే వాహనాలను అన్నవరం గ్రామం మీదుగా పాలకొండ పట్టణంలోకి మళ్లించేలా చర్యలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు రహదారిపై గుంతలను సోమవారం యుద్ధప్రాతిపదికన పూడ్చివేశారు. వైస్ ఎంపీపీలు కనపాక సూర్యప్రకాష్, వాకముడి అనీల్‌కుమార్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు లోలుగు విశేశ్వరరావు, అన్నవరం సర్పంచ్ గవర రాజశేఖర్, పీఆర్ ఈఈ ఎస్.రాధారాణి, డీఈఈ దారపు లోకనాథం, ఏఈ కిరణ్‌కుమార్ పనులను పర్యవేక్షించారు. దీర్ఘకాలంగా వేధిస్తున్న రహదారి సమస్య పరిష్కారం కావటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆహార భద్రతపై అవగాహన

కురుపాం: ప్రపంచ ఆహార భద్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని బియ్యాలవలస పంచాయతీ దురుబిలి గ్రామంలో యూత్ ఎంపవర్‌మెంట్ సర్వీసెస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ ఆధ్వర్యంలో సోమవారం ఆహార భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 29 రకాల ఆహార ధాన్యాలు, పండ్లు, దుంపలు, వివిధ రకాల కూరగాయల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. రసాయనతో కూడిన కలుషిత ఆహార పదార్థాలు తిని ఆరోగ్యాన్ని పాడుచేసుకోవద్దని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పువ్వల అజ్జారి, మాజీ సర్పంచ్ పువ్వల పత్తి, ప్రకృతి వ్యవసాయ ఫార్మ్ సైంటిస్టు నరసమ్మ, తదతరులు పాల్గొన్నారు.

టీటీడీ సహకారంతో దేవాలయాల నిర్మాణం

పాలకొండ: దేవాలయాల నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం సహకారం అందిస్తోందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని రుద్రిపేట గ్రామంలో టీటీడీ నిధులు రూ.10 లక్షలతో నిర్మిస్తున్న శ్రీతుంబాలమ్మ గ్రామదేవత ఆలయ ప్రతిష్ఠ మహోత్సవంలో సోమవారం వారు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గంలో వందకు పైగా ఆలయాల పునర్నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు నేడబిల్లి ప్రసాద్, లావణ్య, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజుల్లోనే ఇంటి పట్టా మంజూరు

వీరఘట్టం: 'జగనన్నకు చెపుదాం' కార్యక్రమంలో ఇంటి స్థలం మంజూరు చేయాలని కోరిన మూడురోజులకే అధికారులు దరఖాస్తును పరిశీలించి ఇంటి స్థలం మంజూరు చేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక పెరుగువీధికి చెందిన సీరాపు ఈశ్వరమ్మ ఈ నెల 13న జరిగిన 'జగనన్నకు చెపుదాం' కార్యక్రమంలో ఇంటి స్థలం మంజూరు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేసింది. కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ చందక సత్యనారాయణ ఆమె దరఖాస్తును పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ చేశారు. ఇంటి స్థలం కోసం ఆమె అర్హురాలిగా గుర్తించి స్థలం కేటాయించారు. సోమవారం ఆమెకు పట్టాను అందజేశారు. దరఖాస్తు చేసిన మూడు రోజులకే ఇంటిస్థలం మంజూరు చేసిన అధికారులతో పాటు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఇళ్ల స్థలాల కోసం పలువురు దరఖాస్తు చేశారని, వాటన్నింటినీ పరిశీలించి రెండో జాబితాలో వారందరికీ మరియగిరి సమీపంలో స్థలాలు కేటాయించడంతో పాటు కలెక్టర్ నిషాంత్‌కుమార్, ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్ చేతుల మీదుగా పట్టాలు అందజేస్తామన్నారు.



ఈశ్వరమ్మకు ఇంటి పట్టాను అందిస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ

ప్రతి ఒక్కరూ అక్షరాస్యులుగా మారాలి

- ఎంపీపీ శెట్టి పద్మావతి

కురుపాం: వయోజన విద్యా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ శెట్టి పద్మావతి అన్నారు. కురుపాం గాంధీనగర్ వీధిలో స్వచ్ఛ హృదయ వికాస్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ఎం.బీష్మా ఆధ్వర్యంలో రెవ మీసాల మురళీ అధ్యక్షతన వయోజన విద్యా కేంద్రాల ప్రారంభ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు విధిగా చదువుకోవాలని, విద్య లేకపోతే అన్నింటా వెనుకబడి పోతామన్నారు. వయోజన కేంద్రాల్లో నిరక్షరాస్యులైన పెద్దవాళ్లకు విద్యాబోధన చేయనున్నట్లు చెప్పారు. అనంతరం జిల్లా కోఆర్డినేటర్ ఎం.బీష్మా మాట్లాడుతూ.. వయోజన విద్యా కేంద్రాల్లో అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వయోజనులకు పుస్తకాలు, పలకలు, మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు శెట్టి నాగేశ్వరరావు, కురుపాం ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, పాస్టర్ మండంగి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలు, లైట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ పద్మావతి

ప్రతి కుటుంబానికీ సంక్షేమ లబ్ధి

- ఎమ్మెల్యే కళావతి

పాలకొండ: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని వెలగవాడ పంచాయతీ రుద్రిపేట గ్రామంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతీ గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు అందిస్తున్నామన్నారు. సాంకేతిక కారణాలతో ఎవరైనా పథకాలు పొందలేకపోతే వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. గ్రామంలో అందుతున్న సంక్షేమ పథకాలపై ప్రజలు సంతృప్తిని వ్యక్తం చేశారు. గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.



సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే కళావతి